## పాఠము - 2

# భారతదేశ కేంద్ర ప్రభుత్వము

**పఠనోద్దేశ్యము**

1. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ కార్య నిర్వాహకశాఖ, శాసన నిర్మాణశాఖ, మరియు న్యాయశాఖ విధులను గూర్చి తెలుసుకొనుట.
2. విద్యార్థులు భారతదేశ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, మరియు ప్రధానమంత్రి ఎన్నికలకు అవసరమైన అర్హతలను గూర్చి తెలుసుకొనుట.
3. విద్యార్థులు క్యాబినెట్ యొక్క విధులను గూర్చి జ్ఞానమును పొందుట.
4. విద్యార్థులు భారత పార్లమెంట్ యొక్క అధికారములు మరియు విధులను గూర్చి తెలుసుకొనుట.
5. విద్యార్థులు భారతదేశ సుప్రీంకోర్టు అధికారములను గూర్చి తెలుసుకొనుట.

మన దేశములో కేంద్ర ప్రభుత్వము అత్యున్నత ప్రభుత్వముగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వము **న్యూఢిల్లీలో** కలదు. కేంద్ర ప్రభుత్వము 3 అంగములను కలిగియున్నది. అవి ఏవనగా కేంద్ర **కార్యనిర్వాహక శాఖ, శాసన నిర్మాణ శాఖ, న్యాయశాఖ**. కేంద్ర కార్యనిర్వహక శాఖలో భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి యొక్క నాయకత్వములో యున్న మంత్రి మండలి ముఖ్యపాత్ర వహించుచున్నారు. శాసన నిర్మాణ శాఖను పార్లమెంట్ అని అందురు. అది రెండు సభలను కలిగియున్నది. అవి **(1)రాజ్య సభ (2) లోక్ సభ**. సుప్రీం కోర్టు భారతదేశ అత్యున్నత న్యాయ స్థానముగా వ్యవహరించుచున్నది. ఈ మూడు శాఖల నిర్మాణము, అధికార విధులను ఈ క్రింది విధముగా విభజించవచ్చును.

రాష్ట్రపతి : భారత రాష్ట్రపతి దేశము యొక్క ప్రధమ పౌరుడు. ఈయన దేశము యొక్క అధినేత. అతను / ఆమె దేశములోని అత్యున్నత పదవిని అలంకరించును. కేంద్ర ప్రభుత్వము యొక్క పూర్తి కార్యనిర్వాహక బాధ్యత రాష్ట్రపతి చేతిలో ఉన్నది.





రాష్ట్రపతి ఎన్నికలకు అర్హతలు : భారత రాష్ట్రపతి పదవికి పోటి చేసే వ్యక్తి ఈ క్రింది అర్హతలను కలిగి ఉండవలెను. (1) అతడు / ఆమె భారతీయ పౌరులుగా ఉండవలెను. (2) అతనికి / ఆమెకు 35 సంవత్సరముల వయస్సునిండి ఉండవలెను. (3) కేంద్ర ప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వము లేదా, స్థానిక సంస్థలలో లాభదాయకమైన అధికార పదవుల్లో ఉండరాదు. (4)లోక్‌సభ సభ్యునికి ఉండవలసిన అర్హతలను అతను / ఆమె కలిగి ఉండవలెను. (5) రాష్ట్రపతిని ఎన్నుకొను నియోజక గణములో ఉన్న సభ్యులలో కనీసము పది మంది సభ్యులు అతను / ఆమె పేరును ప్రతిపాదన చేస్తే పదిమంది సభ్యులు ఆ ప్రతిపాదనను ఆమోదించవలెను. రాష్ట్రపతి పదవి కాలము 5 సంవత్సరములు. అతడు / ఆమె తిరిగి ఎన్నికగుటకు అర్హులు.

రాష్ట్రపతి పదవికి పోటీచేసే అభ్యర్థులను నియోజకగణము ఎన్నుకొనును. అందులోని ఓటర్లు లోక్ సభ, రాజ్యసభలలో ఎన్నికైన సభ్యులు, రాష్ట్రశాసన సభ సభ్యులు. రాష్ట్రపతిగా గెలుపొందిన వ్యక్తి భారతదేశ ప్రధాన న్యాయమూర్తి సమక్షములో పదవీ ప్రమాణ స్వీకారము చేయవలెను.

రాష్ట్రపతి అధికారములు, విధులు:(1) కార్యనిర్వహణాధికారములు: రాష్ట్రపతిని దేశ ప్రధాన కార్యనిర్వాహణాధికారిగా భారత రాజ్యాంగము ప్రకటించినది. తన అధికారమును స్వయముగా గాని, ప్రతినిధుల ద్వారా గాని నిర్వహించవచ్చును. రాష్ట్రపతి తన అధికారములను ప్రధానమంత్రి మరియు మంత్రి మండలి సలహాపై నిర్వహించును. ప్రభుత్వ కార్యక్రమములన్నియు రాష్ట్రపతి పేరుమీద జరుగును.

ప్రధాన మంత్రి, మంత్రిమండలి, రాష్ట్రగవర్నర్లను, సుప్రీం కోర్టు మరియు హైకోర్టు ప్రధానన్యాయమూర్తులను, ఇతర న్యాయమూర్తులను ఇతర ముఖ్య అధికారులను రాష్ట్రపతి నియమించును.

(2) శాసన నిర్మాణాధికారములు: రాష్ట్రపతి పార్లమెంటును సంవత్సరమునకు కనీసము రెండు పర్యాయములు సమావేశ పరచును. లోక్‌సభ, రాజ్యాసభ సమావేశములను వాయిదా వేయుటకు లేదా



నిలిపివేయుటకు రాష్ట్రపతికి అధికారము కలదు. రాష్ట్రపతికి లోక్ సభను రద్దుచేసే అధికారము కూడ కలదు. రాష్ట్రపతి 12 మంది సభ్యులను రాజ్యసభ సభ్యులుగా నియమించును. వారిలో కొంత మందిని విజ్ఞాన శాస్త్రములో సాహిత్యములో, లలిత కళలలో, సంఘసేవలో సుప్రసిద్ధులైన వారిని రాజ్య సభ సభ్యులుగా రాష్ట్రపతి నియమించును. ఆంగ్లో ఇండియన్ వర్గము నుండి లోక్ సభకు కావలసిన ఇరువురి సభ్యులు ఎన్నిక కాని సమయంలో రాష్ట్రపతి ఆంగ్లో-ఇండియన్ వర్గమునకు చెందిన వారిని లోక్‌సభ సభ్యులుగా నియమించును.

పార్లమెంటులో ప్రారంభ ఉపన్యాసము చేసే అధికారము రాష్ట్రపతిదే. రాష్ట్రపతి సంయుక్త సమావేశములలోను లేదా ఇరు సభలలో వేరు వేరుగాను, ఉపన్యాసములను ఇచ్చును. ఒక సభ ఆమోదించిన బిల్లులను వేరొక సభ తిరస్కరిస్తే రాష్ట్రపతి సంయుక్త సమైవేశాన్ని ఏర్పాటు చేయవచ్చును. రెండు సభలు ఆవెూదించిన బిల్లు రాష్ట్రపతి ఆమోదించినపుడే చట్టబద్ధమగును. పార్లమెంటు సమావేశములో లేనప్పడు ప్రభుత్వ అవసరాలను బట్టి రాష్ట్రపతి అత్యవసర ఉత్తర్వులను జారి చేయవచ్చును.

(3) ఆర్థికాధికారములు: రాష్ట్రపతి ఆమోదముద్ర లేనిదే ఆర్థిక బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టరాదు. భారత రాజ్యాంగము జాతీయ ఆగంతుక నిధిని వినియోగించు అధికారమును రాష్ట్రపతికి ఇచ్చినది. అకస్మాత్తుగా సంభవించు దేశ వ్యయమును ఎదుర్కొనుటకు కావలసిన ధనమును రాష్ట్రపతి పార్లమెంట్ యొక్క సలహా ప్రకారము ఈ నిధి నుండి వినియోగించును. 5 సంవత్సరాలకొక సారి లేక రాష్ట్ర ప్రభుత్వము కోరిన సమయములలో ఆర్థిక కమిషన్‌ని రాష్ట్రపతి ఏర్పాటు చేయవలెను.

(4) న్యాయ సంబంధాధికారములు: రాష్ట్రపతి ఉన్నత న్యాయస్థానము విధించిన శిక్షలను క్షమించవచ్చు లేదా తాత్కాలికముగా నిలిపి వేయవచ్చును. శిక్ష అమలును వాయిదా వేయవచ్చును, లేక శిక్షను మరో రకముగా మార్చవచ్చును. రాజ్యాంగ వివరణ కొరకు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాలను కోరవచ్చును.

# 1950 నుండి మన దేశ రాష్ట్రపతులు



డా॥ రాజేంద్ర ప్రసాద్
1950-1962



డా॥ఎస్. రాధా క్రిష్ణన్
1962-1967



డా॥ జాకీర్ హుస్సేన్
1967-1969



వి.వి. గిరి
1969-1974



ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్
1974-1977



ఎన్. సంజీవ రెడ్డి
1977-1982





జ్ఞానీ జైల్ సింగ్
1982-1987



ఆర్. వెంకటరామన్
1987-1992



డా॥ శంకర్ దయాళ్ శర్మ
1992-1997



కె.ఆర్. నారాయణన్
1997-2002



డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం
2002-2007



శ్రీమతి ప్రతిభా దేవిసింగ్ పాటిల్
2007 -

**(5) అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్రపతి అధికారములు :** భారత రాష్ట్రపతికి అత్యవసర అధికారములను రాజ్యాంగము కల్పించినది. (ఎ)యుద్ధ పరిస్థితి తటస్థించినప్పడు, విదేశీ దురాక్రమణకు గురైనప్పడు, సైనిక తిరుగుబాటులు సంభవించినపుడు, (బి) రాష్ట్రములలో రాజ్యాంగ బద్ధమైన పరిపాలన కొనసాగనప్పడు, (సి) దేశములో ఆర్థిక పరమైన సంక్షోభము సంభవించినప్పుడు రాష్ట్రపతి అత్యవసర అధికారమును ప్రయోగించవచ్చును.

**ఉపరాష్ట్రపతి :** భారత రాజ్యాంగ ప్రకారము భారతదేశానికి ఒక ఉపరాష్ట్రపతి ఉండును. అతనిని పార్లమెంటులోని ఇరుసభల సభ్యులు ఎన్నుకొందురు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు అర్హతలు ఏవనగా (1) భారతీయ పౌరుడుగా ఉండవలెను. (2) 35 సంవత్సరాలు వయస్సు నిండి యుండవలెను. (3) రాజ్యసభ సభ్యుడు కావడానికి కావలసిన అర్హతలు ఉండవలెను. ఇతని పదవి కాలము 5 సంవత్సరములు. ఉపరాష్ట్రపతి రాజ్యసభ అధ్యక్షుడుగా వ్యవహరించును. రాష్ట్రపతి అనారోగ్యము పాలైనపుడు, విదేశ పర్యటనలో ఉన్నపుడు ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి విధులను తాత్కాలికముగా నిర్వహించును. రాష్ట్రపతి తన పదవిని రాజీనామా చేసినప్పుడు, పదవి నుండి తొలగించినప్పుడు లేదా మరణించినప్పుడు ఉపరాష్ట్రపతి 6 మాసములు రాష్ట్రపతిగా పనిచేయవచ్చును.

**ప్రధాన మంత్రి మరియు మంత్రిమండలి :** భారత రాజ్యాంగము రాష్ట్రపతికి పాలనలో సహాయము చేయుటకు ప్రధానమంత్రి నాయకత్వమునవున్న మంత్రి మండలిని ఏర్పాటు చేసియున్నది. రాష్ట్రపతి మంత్రిమండలి తీర్మానములను పునఃపరిశీలన చేయమని కోరవచ్చును. చివరికి పునఃపరిశీలన చేసిన తీర్మాణములను రాష్ట్రపతి అంగీకరించవలెను.

**ప్రధాన మంత్రి నియామకము :** లోక్ సభలో అధిక సంఖ్యా బలముగల రాజకీయ పక్ష నాయకుని ప్రధాన మంత్రిగా రాష్ట్రపతి నియమించును. ప్రధాన మంత్రి సలహాపై ఇతర మంత్రులను రాష్ట్రపతి



## 1947 సం॥ నుండి భారతదేశ ప్రధాన మంత్రులు

| క్ర.సం. | పేరు | సంవత్సరము |
|---|---|---|
| 1. | శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ | 1947-1964 |
| 2. | శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి | 1964-1966 |
| 3. | శ్రీమతి ఇందిరా గాంధి | 1966-1977 |
| 4. | శ్రీ మురార్జీ దేశాయ్ | 1977-1979 |
| 5. | శ్రీ చరణ్ సింగ్ | 1979-1980 |
| 6. | శ్రీమతి ఇందిరా గాంధీ | 1980-1984 |
| 7. | శ్రీ రాజీవ్ గాంధీ | 1984-1989 |
| 8. | శ్రీ వి.పి. సింగ్ | 1989-1990 |

## 1947 సం॥ నుండి భారతదేశ ప్రధాన మంత్రులు

| క్ర.సం. | పేరు | సంవత్సరము |
|---|---|---|
| 9. | శ్రీ చంద్ర శేఖర్ | 1990-1991 |
| 10. | శ్రీ పి.వి. నరసింహా రావు | 1991-1996 |
| 11. | శ్రీ ఎ.బి. వాజ్‌పేయి | మే 1996 |
| 12. | శ్రీ హెచ్.డి. దేవేగౌడ | 1996-1997 |
| 13. | శ్రీ ఐ.కె. గుజ్రాల్ | 1997-1998 |
| 14. | శ్రీ ఎ.బి. వాజ్‌పేయి | ఏప్రిల్ 1998 |
| 15. | శ్రీ ఎ.బి. వాజ్‌పేయి | 1999-2004 |
| 16. | శ్రీ మన్ మోహన్ సింగ్ | 2004- |



నియమించును. లోక్ సభకు ఏ రాజకీయ పక్షమునకు మెజారిటి లేకపోతే, మంత్రిమండలిని ఏర్పాటు చేయగల సమర్ధత ఉన్న రాజకీయ పక్ష నాయకుని రాష్ట్రపతి ప్రధాన మంత్రిగా నియామకము చేయవచ్చును. రాష్ట్రపతి సమక్షములో మంత్రులు పదవి ప్రమాణ స్వీకారము చేయుదురు. ప్రధాన మంత్రి మరియు మంత్రిమండలి జీత భత్యములను పార్లమెంట్ నిర్ణయించును. పార్లమెంట్ సభ్యులుగా లేని వారిని కూడ మంత్రులుగా నియమించవచ్చును. కానీ మంత్రిగా ఎన్నికైన 6 మాసములలో పార్లమెంట్ సభ్యుడుగా గెలుపొందవలెను. మంత్రి మండలిలోని మంత్రులు స్వయముగాను, సమిష్టిగాను లోక్ సభకు బాధ్యత వహించవలెను.

మంత్రులను మూడు రకములుగా విభజింపచ్చును. ప్రధాన మంత్రితోపాటు **(1) క్యాబినెట్ మంత్రులు (2) స్టేట్ మంత్రులు (3) డిప్యూటి మంత్రులు.** క్యాబినెట్ మంత్రులు ముఖ్యమైన మంత్రిత్వ శాఖలకు అధిపతులుగా నుండి ప్రభుత్వ ముఖ్య నిర్ణయములను చేసెదరు.

రెండు మరియు మూడువ శ్రేణికి చెందిన మంత్రులు క్యాబినెట్ సభ్యులుకారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వారు క్యాబినెట్ సమావేశములలో పాల్గొనుదురు. డిప్యూటీ మంత్రులకన్న స్టేట్ మంత్రులకు హోదా ఎక్కువ. వారిద్దరికి ప్రత్యేకమైన శాఖలు ఉండవచ్చును, లేకపోవచ్చును. డిప్యూటీ మంత్రులు క్యాబినెట్ మంత్రులకు సహాయపడుదురు.

**ప్రధానమంత్రి స్థానము మరియు అధికారములు :** భారత దేశములో వాస్తవిక కార్య నిర్వాహణాధికారిగా ప్రధాన మంత్రి వ్యవహరించును. మంత్రులకు శాఖలను ప్రధానమంత్రి కేటాయించును. ప్రధాన మంత్రి, ఏ మంత్రినైనను రాజీనామా చేయమని కోరవచ్చును.

తన నాయకత్వములో వున్న క్యాబినెట్ ఎచ్చట ఎప్పడు సమావేశము కావలెనో ప్రధానమంత్రి నిర్ణయించును. ప్రధానమంత్రి క్యాబినెట్ యొక్క నాయకుడు. ఇతర మంత్రులు అతని సహచరులు. క్యాబినెట్ సమావేశము లేనపుడు ప్రధాన మంత్రి రెండు లేదా మూడు

అనుభవజ్ఞులైన తన సహచరులతో జాతీయ విషయములను గూర్చి సంప్రదింపులు చేయును. ఇతర మంత్రుల పనులను ప్రధాన మంత్రి పరిశీలించును.

**క్యాబినెట్ :** అనుభవజ్ఞులైన మంత్రులతో కూడిన క్యాబినెట్, పాలనా యంత్రమునకు బీజము వంటిది. ప్రభుత్వము యొక్క ముఖ్య తీర్మాణములను క్యాబినెట్ నిర్ణయించును. ఇతర మంత్రులు క్యాబినెట్ తీసుకొన్న తీర్మానములను అనుసరించవలెను.

క్యాబినెట్ యొక్క ముఖ్య శాసన విధులు ఏమనగా పార్లమెంట్ యొక్క సమావేశములను నిర్ణయించుట మరియు తాత్కాలికముగా రద్దుచేయుట. క్యాబినెట్ అత్యవసర ఉత్తర్వులను ప్రవేశ పెట్టుటకు రాష్ట్రపతికి సలహాలను ఇచ్చుట. రాజ్యాంగ సవరణలో క్యాబినెట్ ముఖ్యపాత్ర వహించుచున్నది.

క్యాబినెట్ యొక్క ముఖ్య పాలనా విధుల ఏవనగా, జాతీయ సిద్ధాంతములను రూపొందించుట, మంత్రుల అభిప్రాయములను పొందుట. క్యాబినెట్‌లో చర్చించిన విధముగా ఆర్థిక మంత్రి వార్షిక బడ్జెట్‌ను తయారు చేయును. క్యాబినెట్‌లో తయారగు ఆర్థిక బిల్లు లోక్‌సభలో రాష్ట్రపతి ఆమోదముతో ప్రవేశపెట్టబడును.

క్యాబినెట్ దేశము యొక్క విదేశాంగ విధానమును రూపొందించును. అంతర్జాతీయ ఒప్పందములను ఆమోదించును. వివిధ దేశములకు రాయబారులను నియమించు విషయములో క్యాబినెట్ ముఖ్యపాత్ర వహించును.

**భారత పార్లమెంట్ :** భారత పార్లమెంట్ రాష్ట్రపతి, రాష్ట్రమండలి (రాజ్యసభ) మరియు ప్రజాప్రతినిధుల సభలను (లోక్‌సభ) కలిగియున్నది.

**రాజ్యసభ సభ్యుల అర్హతలు :** రాజ్యసభకు పోటీచేయు అభ్యర్థి ఈ క్రింది అర్హతలను కలిగి ఉండవలెను.

1. భారతీయ పౌరుడుగా ఉండవలెను.
2. 30 సంవత్సరాల వయస్సు నిండి యుండవలెను.



3. అతడు/ఆమె శాసనములో గుర్తింపబడియున్న ఇతర అర్హతలు కలిగి ఉండవలెను.
4. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వములల్లో ఆదాయం గల ఉద్యోగిగా ఉండరాదు.
5. అతడు/ఆమె మతి స్థిమితము లేని వారుగాను, దివాలాతీసిన వారుగాను ఉండరాదు.

రాజ్యసభ శాశ్వతమైన సభ రాజ్యసభను రద్దు చేయుటకు వీలుకాదు. ఒక్కొక్క సభ్యునికి కాలపరిమితి 6 సంవత్సరములు. ప్రతి రెండు సంవత్సరాలకు 1/3 వంతు సభ్యులు పదవి విరమణ చేసిన, వాటిని కొత్త సభ్యులతో భర్తీచేయుట జరుగును.

**లోక్‌సభ సభ్యుల అర్హతలు:** లోక్ సభకు పోటీచేయు (అతడు/ ఆమె) అభ్యర్థి ఈ క్రింది అర్హతలను కలిగి ఉండవలెను.

1. అతను /ఆమె భారతీయ పౌరులుగా ఉండవలెను.
2. అతను / ఆమె 25 సంవత్సరాల వయస్సు నిండి ఉండవలెను.
3. అతను / ఆమె పేరు మనదేశ ఓటర్ల జాబితాలో ఉండవలెను.
4. అతను / ఆమె కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వములలో ఆదాయముగల ఉద్యోగిగా ఉండకూడదు.

లోక్ సభ సభ్యుని పదవి కాలము ‘5’ సంవత్సరములు. ప్రధాన మంత్రి సలహాలపై రాష్ట్రపతి 5 సంవత్సరములు పూర్తి అగుటకు మునుపే లోక సభను రద్దు చేయవచ్చును.

**పార్లమెంట్ యొక్క అధికారములు మరియు విధులు:** శాసన నిర్మాణ అధికారము, కార్యనిర్వహక శాఖపై నియంత్రణాధికారం, దేశ బడ్జెట్‌ను ప్రవేశపెట్టు అధికారము, ప్రజా సమస్యలను పరిశీలన చేయుట, దేశవిదేశాంగ మరియు అభివృద్ధి ప్రణాళికలను చర్చించుట పార్లమెంటు యొక్క ముఖ్యవిధులు. పార్లమెంటు “మహాభియోగ తీర్మానము” ద్వారా రాష్ట్రపతిని పదవి నుండి తొలగించవచ్చును. పార్లమెంటు రాజ్యాంగము నందు చెప్పబడిన పద్ధతులను అనుసరించి సుప్రీంకోర్టు మరియు హైకోర్టు న్యాయమూర్తులను, ప్రధాన ఎన్నికల కమిషనర్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను పదవి నుండి తొలగించవచ్చును.

పార్లమెంట్ ప్రశ్నావళి ద్వారా కార్యనిర్వహక వర్గముపై నియంత్రణాధికారం కలిగియున్నది. అవిశ్వాస తీర్మానము, సావధాన తీర్మానము, కోత తీర్మానము లాంటి అనేక తీర్మానాల ద్వారా ప్రశ్నోత్తర సమయమును ఉపయోగించుకొని కార్యనిర్వహక వర్గముపై నియంత్రణ చేయును. రాష్ట్ర సరిహద్దులను మార్చు అధికారము పార్లమెంటుకు కలదు.

**న్యాయశాఖ :** ప్రభుత్వము యొక్క మూడవ శాఖ న్యాయశాఖ. ప్రజల ప్రాథమిక హక్కులను మరియు స్వేచ్ఛను పరిరక్షించుటలో ఇది ప్రధాన పాత్ర వహించుచున్నది. రాజ్యాంగము మరియు చట్టములను వివరించుటలోను ముఖ్య పాత్రను వహించుచున్నది.

**సుప్రీంకోర్టు :** సుప్రీంకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, 25 మంది న్యాయమూర్తులు కలరు. రాష్ట్రపతి ప్రధాన న్యాయమూర్తిని నియమించును. ఇతర న్యాయమూర్తుల నియామక విషయములో రాష్ట్రపతి ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించును.

భారత రాజ్యాంగ ప్రకారము సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియామకము కావడానికి ఈక్రింది అర్హతలు ఉండవలెను.

1. అతను / ఆమె భారతీయ పౌరులుగా ఉండవలెను.
2. అతనికి / ఆమెకి ఒకటి లేక అనేక హైకోర్టులలో న్యాయమూర్తిగా కనీసం 5 సంవత్సరముల అనుభవము ఉండవలెను.
3. అతను / ఆమె ఒకటి లేక అనేక హైకోర్టులలో పది సంవత్సరాలు న్యాయవాదిగా అనుభవము పొంది ఉండవలెను. లేదా,
4. అతను / ఆమె రాష్ట్రపతి దృష్టిలో ప్రజ్ఞావంతులైన ప్రముఖ న్యాయవేత్త అయి ఉండవలెను.

సుప్రీంకోర్టు న్యామూర్తుల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరములు. సుప్రీంకోర్టు న్యూఢిల్లీలో కలదు. భారత రాష్ట్రపతి ఆమోదముతో ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టును ఇతర రాష్ట్రములకు లేదా ఇతర స్థలములకు మార్చవచ్చును.



**సుప్రీంకోర్టు అధికారములు మరియు విధులు :**




**1. ఒరిజినల్ లేదా ప్రాథమిక అధికార పరిధి :** 1. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రములకు మధ్య వచ్చిన వివాదములను పరిష్కరించుట. 2. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు మరియు ఇతర రాష్ట్రముల మధ్య వచ్చిన వివాదములను పరిష్కరించుట. 3. రాష్ట్రముల మధ్య తలెత్తే వివాదములు. 4. రాజ్యాంగములో పేర్కొన్న ప్రాథమిక హక్కులను అమలు పరచడములో ఏర్పడే వివాదములు. 5. ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులను పరిరక్షించుటకు సుప్రీంకోర్టు రిట్‌లను జారీచేయును. అవి ఎ) హేబియస్ కార్పస్, బి) మేండమస్, సి) ప్రొహిబిషన్, డి) కోవారెంటో, ఇ) సెర్షియోరరీ.

**2. అప్పీళ్ల విచారణాధికార పరిధి:** దేశములో సుప్రీంకోర్టు నిర్ణయం తిరుగులేనిది. హైకోర్టు ఇచ్చిన సివిల్ మరియు క్రిమినల్ తీర్పులపై విచారణ చేసే అధికారం సుప్రీం కోర్టుకు ఉన్నది. హైకోర్టు తీర్పు యిచ్చిన దావాలను, అది అప్పీలు చేయడానికి తగిన వివాదమని హైకోర్టు నిర్ణయించిననే, సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకొనవచ్చును.

**3. సలహారూపక అధికార పరిధి:** రాష్ట్రపతి, దేశమునకు సంబంధించిన న్యాయ పరమైన విషయములలో సుప్రీం కోర్టు సలహాలను కోరవచ్చును.

**4. ఇతర అధికారములు:** సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ప్రచురించి, భద్రపరచెదరు. సుప్రీం కోర్టు నిబంధనావళిని అతి క్రమించిన వారిని కోర్టు ధిక్కరణ నేరం క్రింద శిక్షించడము జరుగును.

ఎ) సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు (సూత్రములను) దిగువ కోర్టువారు ఆమోదించి అమలు పరచవచ్చును.

బి) రాష్ట్రపతి యొక్క ఆమోదముతో సుప్రీంకోర్టు సాధారణంగా కోర్టుకు సంబంధించిన ఆచరణ విధానాన్ని నియంత్రించే చట్టాలను చేసే అధికారము కలదు.

సి) సుప్రీంకోర్టుకు దిగువ కోర్టులపై సర్వాధికారములు కలవు.

**న్యాయ సమీక్షాధికారము:** సుప్రీంకోర్టు రాజ్యాంగమును పరిరక్షించుచున్నది. శాసనములను రాజ్యాంగ విరుద్ధమని, చట్ట విరుద్ధమని నిర్ణయించు అధికారము, న్యాయ స్థానమునకు కలదు. ఈ అధికారమును **న్యాయసమీక్షాధికారమని** అందురు. సుప్రీంకోర్టునకు ఈ అధికారము కలదు. భారత సుప్రీం కోర్టు **వ్యక్తిగత సమీక్షాధికారమును** కలిగియున్నది.

ఎ) కేంద్ర మరియు రాష్ట్రముల మధ్య వివాదాలు తీర్చుట.

బి) రాజ్యంగమును గురించిన సందేహములను, అభిప్రాయబేధములను తీర్చుట.

సి) ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుట.

డి) శాసన సభలు రూపొందించు శాసనములు రాజ్యాంగమునకు విరుద్ధముగా వున్నవా అని పరిశీలించుట.

**అధ్యయన ఫలితములు**

1. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక శాఖ, శాసన నిర్మాణశాఖ మరియు న్యాయశాఖ అధికారములను, విధులను చెప్పగలరు.
2. విద్యార్థులు భారత రాష్ట్రపతి మరియు ఉపరాష్ట్రపతి ఎన్నికలకు కావలసిన అర్హతలను వివరించగలరు.
3. విద్యార్థులు పార్లమెంటు నిర్మాణము మరియు కేంద్ర ప్రభుత్వమును గూర్చి వివరించెదరు.
4. విద్యార్థులు భారత సుప్రీంకోర్టు అధికారములను గూర్చి, విధులను గూర్చి తెలుసుకొందురు.



# స్వయం పరిశీలన

**I. సరియైన సమాధానములను ఎన్నుకొనుము.**

1. కేంద్ర ప్రభుత్వము ______________ అంగములను కలిగియున్నది.
   అ) రెండు　　ఆ) మూడు
   ఇ) ఒకటి　　ఈ) నాలుగు
2. మంత్రిమండలి నాయకుడు
   అ) ప్రధానమంత్రి　　ఆ) రాష్ట్రపతి
   ఇ) ఉపరాష్ట్రపతి　　ఈ) ఉప ప్రధానమంత్రి
3. రాజ్య సభలో ఉన్న సభ్యుల సంఖ్య
   అ) 238　　ఆ) 248
   ఇ) 250　　ఈ) 12
4. సుప్రీం కోర్టు ఎచ్చట ఉన్నది?
   అ) చెన్నై　　ఆ) ముంబాయి
   ఇ) కోల్‌కత్తా　　ఈ) న్యూఢిల్లీ

**II. ఖాళీలను పూరింపుము**

1. పార్లమెంటులో ______________ సభలు కలవు
2. రాష్ట్రపతి ______________ యొత్త అధినేత.
3. ప్రధాన మంత్రి ______________ యొక్క నాయకుడు.
4. మంత్రి మండలి ______________ కు సమిష్టి బాధ్యత వహించును.

**III. జతపరచుము**

| | | |
|---|---|---|
| 1. రాష్ట్రపతి | - | దిగువ సభ |
| 2. ప్రధాన మంత్రి | - | మూడవ అంగము |
| 3. ఉపరాష్ట్రపతి | - | నిజమైన అధికారి |
| 4. న్యాయశాఖ | - | నామమాత్ర అధికారి |
| 5. లోక్‌సభ | - | రాజ్యసభాధ్యక్షుడు |

## IV. సంగ్రహముగా జవాబులనిమ్ము.

1. భారత రాష్ట్రపతి ఎన్నికకు గల అర్హతలు ఏవి?
2. భారత దేశములో ఉపరాష్ట్రపతిని ఏవిధముగా ఎన్నుకొనెదరు?
3. కేంద్ర మంత్రి మండలిలోని మంత్రుల రకములను గూర్చి వ్రాయుము.
4. న్యాయసమీక్షాధికారమును గూర్చి సంగ్రహముగా వ్రాయము.

## V. విపులముగా జవాబులిమ్ము.

1. కేంద్ర ప్రభుత్వ నిర్మాణమును గూర్చి వ్రాయుము.
2. ప్రధాన మంత్రి విధులను వివరించుము.
3. సుప్రీంకోర్టు అధికారములు, విధులను విపులీకరించుము.

## VI. బోధన మరియు పఠన కార్యక్రమములు

1. కేంద్ర ప్రభుత్వ విభాగములను గుర్తించు పటమును గీయుము.
2. కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వహక శాఖ, శాసన నిర్మాణ శాఖ మరియు న్యాయశాఖ అధికారుల పేర్ల పట్టికను తయారుచేయుము.